క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ దేవతా మూర్తులు

కర్నూలు కల్చరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రఘునందన సేవక్ ప్రభు సందేశమిచ్చారు. పురాణ ఇతిహాసాల గురించి విద్యార్థులకు వివరించారు. నిత్యం భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. అంతకుముందు హరే రామ హరే కృష్ణ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. అనంతరం శీల ప్రభు పాదుల ప్రేమ విందు జరిగింది. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి



సమావేశంలో పాల్గొన్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

కర్నూలు కల్చరల్: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరు కంకణబద్ధులు కావాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ప్రతినిధి జోగయ్య శర్మ పిలుపునిచ్చారు. ఆదివారం ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఆదివారం కర్నూలు మండల సమరసత ఫౌండేషన్ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆలయాల సందర్శన, భజన కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు. ప్రతిఒక్కరూ తమకు అనుకూలమైన సమయంలో దేవాలయాలకు వచ్చి భగవంతుడిని దర్శించుకోవాలన్నారు. హిందూ సంస్కృతి సంప్రదాయాల విశిష్టతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన 'మరీ అంతొద్దు' నాటకం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో సీక్యాంప్ కళాక్షేత్రంలో ఆదివారం ప్రదర్శించిన సాంఘిక నాటిక 'మరీ అంతొద్దు' ఆహూతులను అలరించింది. ఆకురాతి భాస్కర చంద్ర రచించిన ఈ నాటికకు నడింపల్లి వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించారు. గుంటూరు ఆరాధన ఆర్ట్స్ కళాకారులు తమ నటనతో ప్రేక్షకులను మెప్పించారు. నాటిక దర్శకునికి కళాక్షేత్రం తరఫున రూ.20 వేలు పారితోషికం అందజేశారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రముఖ కళా సంస్థలను ఆహ్వానించి ప్రతి నెలా చివరి ఆదివారం ఒక సాంఘిక నాటిక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాటకం దర్శకులు మాట్లాడుతూ బంధుత్వం, బాంధవ్యాలు తెగిపోతున్న ఈ రోజుల్లో కుటుంబ సంబంధాలు బలంగా ఉండాలని కోరుకుంటూ ఈ నాటిక సందేశాన్ని అందిస్తుందన్నారు. కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు ఇనాయతుల్లా, యాగంటీశ్వరప్ప, ఈశ్వరయ్య, బాల వెంకటేశ్వర్లు, లక్ష్మీకాంతరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

ఆలూరు: మండలంలోని మనేకుర్తి, ఏ.గోనేహాళ్, అంగస్కల్లు, కమ్మరచేడు, కాత్రికి తదితర గ్రామాల్లో పేకాట స్థావరాలపై ఆలూరు పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఇందులో భాగంగానే కమ్మరచేడు గ్రామానికి చెందిన మంగలి నాగరాజ్ ఇంట్లో పేకాట ఆడుతున్న నాగరాజ్‌తో పాటు అదే గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి మరో 10 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ 21.565 నగదు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు ఎస్‌ఐ సి.వి నరసింహులు తెలిపారు. దాడుల్లో ఏఎస్‌ఐ చంద్రశేఖర్,హెడ్ కానిస్టేబుల్స్ జానీ వాకర్, రంగయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆదోని రూరల్: మండలంలోని కడితోట గ్రామ సమీపంలో శనివారం రాత్రి స్కూటర్‌ను ఆటో ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన చోటు చేసుకుంది. పెద్దతుంబళం ఎస్‌ఐ మహేష్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు .. కోసిగి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అశోక్ ఆదోని నుంచి కోసిగికి వెళ్తున్నాడు. అదే సమయంలో ఆదోని పట్టణం కల్లుబావికి చెందిన హరి బైకుపై పెద్దతుంబళంవైపు వెళ్తున్నాడు. మండలంలోని కడితో వద్దకు రాగానే ఆటో స్కూటర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హరి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రహదారిని కప్పేసిన పిచ్చిమొక్కలు





శిథిలమైన పోలీసు క్వార్టర్స్

కర్నూలు నగరం నడిబొడ్డున కొత్తబస్టాండ్ ఎదురుగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు వెనుక వైపున పోలీస్ క్వార్టర్స్ నిరుపయోగంగా ఉండటంతో కంప చెట్లు అడ్డదిడ్డంగా పెరిగి అడవిని తలపిస్తోంది. గతంలో వర్షాకాలంలో గోడలు మెత్తబడి విరగడంతో ఓ కానిస్టేబుల్ భార్య టెర్రస్ పైనుంచి కిందపడినప్పటి నుంచి క్వార్టర్స్‌ను ఖాళీ చేయించారు. కొత్త భవనాలు నిర్మించాల్సి ఉన్నా పట్టించుకోకపోవడంతో అడ్డదిడ్డంగా పెరిగిన కంపచెట్లు, శిథిలమైన భవనాలతో బూత్ బంగ్లాను తలపిస్తోంది. దీంతో అక్కడక్కడా నివాసం ఉన్నవారు భవనాలు ఎప్పుడు కూలుతాయోననే ఆందోళనతో భయం గుప్పిట్లో కాలం వెల్లదీస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



పూర్తిగా ధ్వంసమైన భవనం







నేడు సంపూర్ణ భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: ఏకాదశి పురస్కరించుకొని గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచారధామంలో సంపూర్ణ భగవద్గీత పారాయణం చేపట్టనున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డీవీ రమణ తెలిపారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

నవగ్రహాల ప్రతిష్ట

కర్నూలు కల్చరల్: వన్‌టౌన్‌లోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నవగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. మాజీ డిప్యూటీ మేయర్ మురళీధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ట జరిగింది. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

డీఈఓను కలిసిన ఉపాధ్యాయ సంఘాలు

కర్నూలు సిటీ: జిల్లా విద్యాశాఖ అధికారిగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన ఎస్.శామ్యూల్ పాల్‌ను ఆదివారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం డీఈఓను కలిసి పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ప్రకాష్ రావు, ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, సేవలాల్ నాయక్ డీఈఓను మర్యాద పూర్వకంగా కలిశారు. డీఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంఘాలు, టీచర్ల సహకారంతో జిల్లాలో విద్యా వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): 104 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఆ సంఘం రాష్ట్ర నాయకులు పెద్దయ్య, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షతన 104 ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 వాహనాల నిర్వహణ భారాన్ని ప్రభుత్వమే భరించాలని, వాహనాలను పీహెచ్‌సీల పరిధిలోకి తేవాలన్నారు. జీఓ నంబర్ – 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు చంద్రహాస్, వెంకటేష్, హరి మోహన్, వినోద్, కల్యాణి, చిట్టెమ్మ పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలి



మాట్లాడుతున్న డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్

కర్నూలు సిటీ: విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండి పట్టుదలతో ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ అన్నారు. స్థానిక మాంటిస్సోరి హైస్కూల్‌లో ఆదివారం జన విజ్ఞాన వేదిక జిల్లా చెకుముకి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలు, శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. చెకుముకి సంబరాలు నిర్వహించడం వల్ల విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తి పెంచుతుందన్నారు. అనంతరం జన విజ్ఞాన వేదిక రాష్ట్ర యూత్ కన్వీనర్ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి సమస్యను శాస్త్రీయంగా ఆలోచించి పరిష్కారం కనుగొనాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్, జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి ఖాజా హుసేన్ మాట్లాడారు. సమతా కన్వీనర్ రమాదేవి, జన విజ్ఞాన వేదిక నాయకులు దేవమణి, శంకరయ్య, రుద్రముని, అజాద్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కనకదాసు జయంతిని అధికారికంగా నిర్వహించాలి

కర్నూలు(అర్బన్): కురువల ఆరాధ్య దైవం భక్త కనకదాసు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం కర్నూలులో అధికారికంగా నిర్వహించాలని జిల్లా కురువ సంఘం నేతలు కోరారు. ఆదివారం సంఘం అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి నేతృత్వంలో పెనుగొండలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవితను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో కనకదాసు జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. అలాగే తిరుపతి, శ్రీశైలం, మహానంది, విజయవాడ, విశాఖపట్నం తదితర ముఖ్యమైన ప్రాంతాల్లో కనకదాసు భవనాలను నిర్మించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీలీల, నాయకులు కేసీ నాగన్న, తవుడు శ్రీనివాసులు ఉన్నారు.



మంత్రి సవితకు వినతి పత్రం అందిస్తున్న కురువ సంఘం నేతలు

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి విమర్శించారు. స్థానిక సలాంఖాన్ భవనంలో ఆదివారం ఎస్టీయూ జిల్లా కార్యవర్గ తృతీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలే శరణ్యం అని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటిందని, రాష్ట్రంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో చొరవ చూపడం లేదన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలన్నారు. యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ జీఓ ఎం.ఎస్ నెంబరు 117ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, సీపీఎస్/జీపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.21 వేల కోట్ల బకాయిలను మంజూరు చేయాలని, జీఓ 84ను సవరించాలని, బదిలీలకు, పదోన్నతులకు శాశ్వత కోడ్ చట్టాన్ని రూపొందించాలన్నారు. ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, నాగరాజు, సుంకన్న, రామ్మోహన్ రెడ్డి, బసవరాజు, ప్రసన్నరాజు, నాగేంద్రప్ప, దేవదాస్, రమేష్, సుధీర్, ముదాసీర్ అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

● భలే బసవన్న

సంక్రాంతి పండుగ సమయంలో సందడి చేసే బసవన్న ప్రస్తుతం కర్నూలు నగరంలో దర్శనమిస్తున్నాడు. ఒంగోలు గిత్తకు యజమాని బసవన్న వేషం వేసి ప్రదర్శన చేయిస్తూ వాడవాడలా తిరుగున్నాడు. సన్నాయి మేళానికి అనుగుణంగా ఎద్దును ఆడిస్తూ, ప్రజలకు నమస్కారాలు చేయిస్తూ వారిచ్చే కానుకలను స్వీకరిస్తూ ముందుకు సాగుతున్నాడు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



సౌత్‌జోన్ పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): గుంటూరులో నవంబర్ 10వ తేదీన నిర్వహించే సౌత్ జోన్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాణించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ క్రీడాకారులకు సూచించారు. ఆయన ఆదివారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సిలంబం క్రీడాకారులకు టీషర్టులు, పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్‌లో నిత్యం సాధన చేస్తే ఉత్తమంగా రాణించవచ్చని చెప్పారు.

తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు

నగరంలోని పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు సమీపంలోని పార్కులో ఆదివారం తైక్వాండో చిన్నారులకు బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు కార్పొరేటర్ అబ్దుల్ లతీఫ్ బెల్టులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ రోజూ క్రీడల్లో సాధన చేయడం వల్ల ఆరోగ్యంగా, చురుకుదనంతో ఉంటారన్నారు. సీనియర్ శిక్షకులు టీ. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రహదారిని బాగు చేయండి

● మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి సీపీఎం బహిరంగ లేఖ

కర్నూలు(సెంట్రల్): శిథిలావస్థకు చేరిన ఎమ్మిగనూరు–కోడుమూరు రోడ్డును బాగు చేయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రోడ్డు మొత్తం గుంతలు పడిపోవడంతో ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు ప్రాంతాల నుంచి కర్నూలుకు వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ రహదారిలో ప్రతి నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయని, అనుకోకుండా ఏమైనా ప్రమాదాలు జరిగితే తీరని నష్టం జరుగుతుందని చెప్పారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపుతున్నాయని, ప్రభుత్వాల విధానాలపై పోరాటం చేసేందుకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. డిసెంబర్ 29, 30 తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభల ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశాన్ని ఆదివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గోవిందు అధ్యక్షతన నిర్వహించారు. ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయక ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. రామమందిరం పేరుతో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ రామ మందిరం నిర్మించిన అయోధ్యలోనే ఓడిపోయిందని గుర్తు చేశారు. మతాన్ని బట్టి ఓట్లు పడవని బీజేపీ గుర్తుంచుకోవాలని హితవుపలికారు. ఇదేవిధంగా రాష్ట్రంలో అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చి నేడు ప్రజలపై రూ.వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపేందుకు నిర్ణయించుకుందన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎం జిల్లా మహాసభల ఆహ్వాన కమిటీని ఎంపిక చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు రామాంజినేయులు, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, గురుశేఖర్, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నీటి శుద్ధి కేంద్రం తనిఖీ

కర్నూలు (టౌన్): నగరపాలక పరిధిలోని మునగాలపాడులో 15 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రాన్ని కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం తనిఖీ చేశారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే వై.జంక్షన్ కూడలి, పార్థసారధి నగర్ ఎస్‌ఏపీ క్యాంపు ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సమస్యలపై ఫిర్యాదు చేయండి

నగరపాలకకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సూచించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మునగాలపాడు నీటి శుద్ధి కేంద్రంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

ముగిసిన ఆర్‌యూ అంతర్ కళాశాలల పోటీలు



ట్రోఫీ అందుకుంటున్న ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రాయలసీమ యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి కళాశాల కరెస్పాండెంట్ వై.శౌరీలు రెడ్డి, ప్రిన్సిపాల్ శాంత, యూనివర్సిటీ కో–ఆర్డినేటర్ శివకిషోర్ హాజరయ్యారు. విజేతలకు కప్పు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవన శైలిలో క్రీడలను భాగంగా చేసుకోవాలన్నారు.

విజేతల వివరాలు : సెపక్‌తక్రా క్రీడాంశంలో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు విన్నర్స్, కర్నూలు సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల జట్టు రన్నర్స్, రాయలసీమ యూనివర్సిటీ జట్టు మూడవ స్థానంలో నిలిచాయి. అలాగే వాలీబాల్ క్రీడాంశంలో కర్నూలు రామకృష్ణ డిగ్రీ కళాశాల జట్టు విన్నర్స్, రాయలసీమ యూనివర్సిటీ జట్టు రన్నర్స్, పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు మూడవ స్థానంలో నిలిచాయి.

బీసీల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(అర్బన్): కర్నూలు పార్లమెంట్ పరిధిలో బీసీల సమస్యలను పరిష్కరించాలని బీసీ జేఏసీ నేతలు కోరారు. ఆదివారం జేఏసీ కన్వీనర్లు దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య ఆధ్వర్యంలో పలువురు నేతలు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో బీసీ భవన్‌ను వెంటనే పూర్తి చేయాలన్నారు. స్థానిక బిర్లాగేట్ సమీపంలోని సర్కిల్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. కర్నూలు నుంచి విజయవాడ వెళ్లేందుకు రైలును ఏర్పాటు చేయించాలని, విశ్వకర్మ పథకం అధిక నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరారు. బ్యాంకుల షరతులు లేకుండా బీసీ కులాలకు రుణాలు అందించాలని, ఎన్‌బీసీఎఫ్‌డీసీ పథకం నిధులను పెంచాలన్నారు. రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ పరిధిలో వలసలను నివారించి ఉపాధి కల్పించాలని కోరారు. ఎంపీ సానుకూలంగా స్పందించడం పట్ల నేతలు హర్షం వ్యక్తం చేశారు. బీసీ నేతలు శ్రీనివాసులునాయుడు, అయ్యన్నయాదవ్, బత్తుల సంజీవరాయుడు, ధనవిజయుడు, వడ్డె లక్ష్మన్న, దేవేంద్ర ఆచారి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ బస్తిపాటి నాగరాజుకు వినతిపత్రం అందిస్తున్న బీసీ జేఏసీ నేతలు

నేర చరిత్ర ఉన్నవారికి లైసెన్స్ ఇవ్వొద్దు

కర్నూలు(సెంట్రల్): నేర చరిత్ర ఉన్న వారికి బాణాసంచా స్టాల్ లైసెన్స్ మంజూరు చేయవద్దని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఓ ప్రకటనలో అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. నియమ, నిబంధనల మేరకు.. బాణాసంచా స్టాళ్ల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలని, ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. దీపావళి పండుగను ప్రశాంత వాతావరణంలో దీపాల మధ్య జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బాణాసంచా పేలుళ్లతో వాతావరణం కలుషితమై పర్యావరణం దెబ్బతింటుందన్నారు. అక్టోబర్ 30, 31, నవంబర్ 1వ తేదీల్లో మాత్రమే బాణాసంచా విక్రయాలకు అనుమతి ఉన్నట్లు చెప్పారు. ఆయా రోజుల్లో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్టాళ్లలో బాణాసంచా విక్రయాలు చేపట్టవచ్చన్నారు.

సిండికేట్‌గా ఉల్లి వ్యాపారులు

- కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్నారు
- మార్కెట్‌లో అవకతవకలపై విచారణ జరిపించాలి
- ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర పెరగకుండా నిరోధిస్తున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ఉల్లికి డిమాండ్ ఉన్నా కర్నూలు మార్కెట్‌లో కొన్ని లాట్లకు మాత్రమే కాస్త ఎక్కువ ధర వేసి మిగిలిన లాట్లను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కర్నూలు మార్కెట్‌లో ఉల్లి రైతుల కష్టాలు తీర్చాలని డిమాండ్‌చేస్తూ ఏపీ రైతు సంఘం ఆదివారం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులో జరుగుతున్న అన్యాయాలు, అవకతవకలపై తక్షణమే విచారణ జరిపించాలని డిమాండ్‌చేశారు. కర్నూలు మార్కెట్‌లో 65 వేల క్వింటాళ్ల ఉల్లి పేరుకుపోయి ఉందని, దీనిని వెంటనే బయటికి పంపి రైతులు తెచ్చిన దిగుబడులను అమ్ముకోవడంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. వ్యాపారులు సిండికేట్ కావడం వల్ల రైతులకు తగిన ఆదాయం లభించడం లేదని, పలువురు రైతులు ఉల్లి దిగుబడులను వెనక్కి తీసుకెళుతున్నారన్నారు. ఉల్లి సాగులో పెట్టుబడి వ్యయం పెరిగినందున క్వింటాలు రూ.5000 ప్రకారం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం ప్రతినిధులు అంజనేయులు, కృష్ణ, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, ఆదాం, రాఘవేంద్ర, సురేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ యార్డులో ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం ప్రతినిధులు